వరదనీటి కాలవ పనుల పరిశీలన


వరదనీటి కాలవ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వరదనీటి కాలవ పనులను కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శనివారం పర్యవేక్షించారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కమలానగర్ నుంచి నేతాజీనగర్ చౌరస్తా వరకు కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక నివాసితులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరిచూసుకుంటూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు

కోదండరామ్‌నగర్‌కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడం మూలంగా వర్షాకాలంలో రోడ్డుపై గుంతలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతానని కాలనీవాసులకు హామీనిచ్చారు.

జాబ్ మేళాకు స్పందన


ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ మిన్హాజుద్దీన్

చాదర్‌ఘాట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆజంపురాలోని చాందిని ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. నిరుద్యోగులకు వారి అర్హత మేరకు ఉద్యోగం సాధించుకోవడానికి వీలుగా ఇబ్‌నాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను అక్బర్‌బాగ్ కార్పొరేటర్ మిన్హాజుద్దీన్, ఆజంపురా ఎంఐఎం నాయకుడు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్‌తో కలిసి ప్రారంభించారు. 33 మల్టీ నేషనల్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో సుమారు 1000 మందికి పైగా నిరుద్యోగులు పాల్గొన్నారు. వీరిలో 150 మంది ఎంపిక కావడంతో వారికి ధ్రువపత్రాలను కార్పొరేటర్ అందజేశారు. కార్యక్రమంలో ఇబ్‌నాథ్ ఫౌండేషన్ ప్రతినిధి ముజీబుల్ రెహమాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి: కార్పొరేటర్


డ్రైనేజీ సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్

సైదాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మురుగు సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ కోరారు. శనివారం ప్రసన్నాంజనేయకాలనీలో జలమండలి డీజీఎం షీలారాణితో కలిసి పర్యటించారు. డ్రైనేజీ ఇబ్బందులపై కాలనీవాసులు వారికి వివరించారు. నూతన డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు. ఇందుకు డీజీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి కార్మిక సంఘం నేత చవ్వ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో మల్‌రెడ్డి రాంరెడ్డి పూజలు


ధ్యానాంజనేయస్వామిని దర్శించుకున్న రాంరెడ్డి

చంపాపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని వినాయక స్వామి, ధ్యానాంజనేయ స్వామికి రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ దుర్గారెడ్డి, ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, బీ.కిరణ్‌కుమార్‌గుప్తా, జీ.అంజిరెడ్డి, చీర తిరుమలేష్, నాయకులు బద్రీ, తోకటి కిరణ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని వినాయక స్వామి, ధ్యానాంజనేయ స్వామికి కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ ఎం.శ్రీనివాస శర్మ కార్పొరేటర్‌కు శేషవస్త్రాలు, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు ఆనంద్‌కుమార్‌గౌడ్, గూడూరు మధుసూదన్‌రెడ్డి, చీర తిరుమలేష్, నాయకులు సద్ది సందీప్ రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్, దశరథ్‌గౌడ్, మిర్యాల అంజయ్యగుప్తా పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు

● పాల్గొన్న మల్లు నందిని


ఉత్సవాల్లో మల్లు నందిని

ఎల్‌బీనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాల పీఠం వారాహి సమేత ప్రత్యంగిరా పరమేశ్వరీ ఆలయంలో వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 18 రకాల ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని శనివారం అమ్మవారిని దర్శించుకుని లక్షపుష్పార్చన, హోమంలలో పాల్గొన్నారు. మల్లు నందినికి ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో విఠల్‌శర్మ, సంపత్, అరుణ, రాజేశ్వరి, హేమ, సాయికుమార్‌శర్మ, రామశర్మ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర


ఆర్‌కేపురం వీధుల్లో జగన్నాథస్వామి రథయాత్ర

ఎల్‌బీనగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలో జగన్నాథస్వామి రథయాత్ర శనివారం వైభవంగా జరిగింది. ఇస్కాన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్రలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీకృష్ణనామస్మరణతో ముందుకు సాగుతూ ఆధ్యాత్మిక అనుభూతి పొందారు. రథయాత్రలో కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఉపేందర్ రెడ్డి, కాలనీ సొసైటీ ప్రతినిధులు రమేష్‌బాబు, రాజే శ్రీరామారావు, వెంకటేశ్వర్లు, నరహరిరావు, ఆంజనేయప్రసాద్, గణేష్‌బాబు, భరత్, శ్రవణ్, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రాధ, నీలిమ, సుజాత, మునిపల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

28న మీర్‌పేట్‌లో బోనాలు : పాండుగౌడ్

సరూర్‌నగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయాలు వెలిసి ఉన్న మీర్‌పేట్‌తో పాటు పరిసర కాలనీల్లో ఈనెల 28వ తేదీన(ఆదివారం) బోనాల పండుగ నిర్వహించుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ పల్లె పాండుగౌడ్ ప్రజలకు సూచించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ కార్యవర్గం, గ్రామ పెద్దలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఆయన చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం కమిటీ తరఫున అన్ని ఏర్పాట్లు చేయనున్నామని, మీర్‌పేట్ కార్పొరేషన్ అధికారులు సైతం తగిన సహకారం అందించాలని ఆయన కోరారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవాలని ఆయన సూచించారు.

'టిమ్స్' నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● ఆస్పత్రి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టిమ్స్ ఆస్పత్రి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలతో పాటు తగిన భద్రతా చర్యలు పాటించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. కొత్తపేటలో నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆస్పత్రి పనులను అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఎల్బీనగర్ శివారు ప్రాంతాల ప్రజలతో పాటు, గ్రామాల నుంచి నగరానికి వచ్చే సామాన్య ప్రజానీకానికి కొత్తపేటలోని టిమ్స్ ఆస్పత్రి ఆరోగ్య ప్రదాయినిగా మారనుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న సదుద్దేశంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో కొత్తపేటలో 26అంతస్తులతో టిమ్స్ ఆస్పత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. నిర్మాణంలో ఎక్కడ కూడా రాజీపడడం లేదన్నారు. సకల వసతులతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన వివరించారు. అదేవిధంగా భావితరాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో స్థలాలు దొరికే అవకాశం లేనందున కేసీఆర్‌ను ఒప్పించి ఆస్పత్రి పరిసరాల్లో విశాలవంతమైన పోలీస్‌స్టేషన్, చిన్నారుల పార్కు, విద్యుత్ సబ్‌స్టేషన్, తాగునీటి రిజర్వాయర్, అధునాతన కమ్యూనిటీ హాల్‌లను కూడా నిర్మించడం జరుగుతుందన్నారు. వీటితో పాటు దేవాలయం, మసీదు కూడా నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు సేదదీరేందుకు ఐదంతస్థుల భవనం కూడా నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రతి 25 నుంచి 30 రోజుల వ్యవధిలో ఒక్కో స్లాబ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఇప్పటికే 6 స్లాబుల నిర్మాణం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, నాయకులు తోట మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, పవన్, గట్టు శ్రీను పాల్గొన్నారు.

'సాధన'ను నిరంతర ఆయుధంగా మార్చుకోవాలి

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న లక్ష్మీనారాయణ, తీగల

సరూర్‌నగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు 'సాధన'ను నిరంతర ఆయుధంగా మార్చుకోవాలని, అప్పుడే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగగలుగుతారని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం మీర్‌పేట్‌లోని టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డితో కలిసి ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముందుగా ఎంచుకున్న లక్ష్యాన్ని చేరగానే అక్కడితో ఆగిపోకూడదని, ఆ వెంటనే మరో లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సైతం చేరుకోవడానికి ప్రయత్నించాలని అన్నారు. 'సాధన' అనే ఆయుధంతోనే అది సాధ్యమని, మారుతున్న కాలానికనుగుణంగా విద్యార్థులు సైతం లక్ష్యాలను మార్చుకుంటూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టార్జితాన్ని వృథా చేయొద్దని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తములుగా ఎదిగి వారి కళ్లల్లో ఆనందం చూడాలని అన్నారు. కార్యక్రమంలో టీకేఆర్ విద్యా సంస్థల కార్యదర్శి తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి తీగల అమర్‌నాథ్‌రెడ్డి, పలు విభాగాల హెచ్‌వోడీలు, ప్రిన్సిపాల్‌లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతలతో.. ఇంద్రసేనారెడ్డి ఆత్మీయ పలకరింపు


త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ జిల్లా కోశాధికారి రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు భాగ్యలక్ష్మీరెడ్డి, అరుణరెడ్డి తదితరులు

చాదర్‌ఘాట్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రాంతానికి చెందిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఆత్మీయంగా పలకరించారు. శుక్రవారం రాత్రి బీజేపీ భాగ్యనగర్ జిల్లా కోశాధికారి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి నివాసానికి ఆయన ప్రత్యేకంగా విచ్చేశారు. ముందుగా సలీంనగర్‌లోని షిరిడీ సాయి సంస్థాన్‌కు విచ్చేసి సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. సలీంనగర్‌కాలనీతో తనకున్న అనుబంధాన్ని ఆయన వివరిస్తూ కాలనీవాసులైన కృష్ణారెడ్డి, రఘురాజ్, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మలక్‌పేటకు చెందిన మూసారాంబాగ్, సైదాబాద్ కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, కొత్తకాపు అరుణరెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు సందడి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, నాయకులు యాదగిరిరెడ్డి, గౌర శ్యాం, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, మలక్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డితోపాటు అనేక మందిని ఇంద్రసేనారెడ్డి స్వయంగా పలకరించారు. ఈసందర్భంగా పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు.


మాట్లాడుతున్న శైలజరామయ్యర్

సురభి కళాకారుల అభ్యున్నతికి కృషి

● ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్

వనస్థలిపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సురభి కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తానని ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ శైలజరామయ్యర్ అన్నారు. శ్రీవినాయక నాట్యమండలి సురభి ఆధ్వర్యంలో వనస్థలిపురం ఓపెన్ ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్న ఆశాడమాస నాటకోత్సవాలకు శనివారం ఆమె హాజరై మాట్లాడారు. సమాజంలో జరిగే జీవిత సత్యాలను కళ్లకు కట్టినట్లు నాటక రూపంలో ప్రదర్శించే కళాకారులను కాపాడుకోవాలని తెలిపారు. అంతరించి పోతున్న సురభి నాటక కళాకారులను ప్రోత్సహించి వారికి చేయూత ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సురభి నాటక నిర్వాహకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్వశక్తితో పురోగాభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న ఓయూ డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్ జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

చాదర్‌ఘాట్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో విద్యార్థులు స్వశక్తితో మరింత పురోగాభివృద్ధి దిశలో పయనించేలా దిశానిర్దేశం చేసుకోవాలని ఓయూ డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్ జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన ఎంబీఏ, ఎంసీఏ పూర్వవిద్యార్థుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే సంస్థ ఏదైనా లాభాలను, అభివృద్ధి, సౌలభ్యాలు పూర్తిస్థాయిలో అందించేలా తమ వంతు కృషి చేయాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. ఏంజెల్స్ సీఈవో డాక్టర్ సీఏ రత్నాకర్ సామవేదం, అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, కళాశాల కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, ఉపాధ్యక్షుడు డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండరావిరాల మైనింగ్ జోన్ భూనిర్వాసితులకు నష్టపరిహారం, అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు బండిగారివి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బండరావిరాల సర్వే నంబర్ 268 మైనింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కోసం 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా వారికి పరిహారం అందించడం లేదన్నారు. భూనిర్వాసితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, పాపయ్యగౌడ్, కొండల్‌రెడ్డి, అంజయ్య, ప్రేమ్, శ్రావణ్‌చారి, కుమార్‌గౌడ్, లింగారెడ్డి, శ్రీకాంత్, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ ఈటల సన్మాన సభ


మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం నాయకుడు రఘురామ్‌నేత తదితరులు

వనస్థలిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వనస్థలిపురంలోని కర్నాటి గార్డెన్స్‌లో ఎంపీ ఈటల రాజేందర్‌కు సన్మానసభను నిర్వహిస్తున్నట్లు పద్మశాలీ సంక్షేమ సంఘం నాయకుడు బొమ్మ రఘురామ్‌నేత తెలిపారు. శనివారం వనస్థలిపురంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపులో పద్మశాలీల పాత్ర ఎంతగానో ఉందన్నారు. పద్మశాలీల అభివృద్ధికి కృషి చేస్తున్న ఈటల రాజేందర్ సన్మాన కార్యక్రమాన్ని పద్మశాలీలు, ఈటల అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి ధనుంజయ, జ్ఞానేశ్వర్, వర్ధలీల, మాధవి, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని గౌరెల్లి నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్ర


పాదయాత్రగా యాదగిరిగుట్టకు వెళ్తున్న కార్యకర్తలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి రావాలని గౌరెల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గ్యార భగవాన్ దాస్ ఆధ్వర్యంలో 18మంది కార్యకర్తల బృందం శనివారం యాదగిరిగుట్టకు పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్రగా బయలుదేరారు. సీనియర్, అనుభవజ్ఞుడైన మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో చెంచల నాగరాజు, ఆంజనేయులు గౌడ్, అశోక్, హరిమోహన్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, వీరస్వామి, సురేష్, దర్శన్, జంగయ్య, సురేష్, కిరణ్, కుమార్, బాలనర్సింహ, బలవంతరెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

పాఠశాల భవనం పూర్తి కాకుండానే తరగతుల నిర్వహణా?

● ప్రమాదం జరిగితే నాకు సంబంధం లేదు : భవన నిర్మాణ కాంట్రాక్టర్


మాట్లాడుతున్న ది విటెజ్ ప్రాజెక్ట్స్ ఎండీ మహ్మద్ తాయర్

హయత్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల భవన నిర్మాణం పూర్తికాక ముందే పాఠశాలను నిర్వహిస్తున్నారు. నిర్మాణ క్రమంలో విద్యార్థులకు ఏదైన ప్రమాదం జరిగితే నాకు ఎలాంటి సంబంధం లేదని మన్నేగూడలో నిర్మిస్తున్న ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్ భవన కాంట్రాక్టర్ ది విటెజ్ ప్రాజెక్ట్స్ ఎండీ మహ్మద్ తాయర్ తెలిపారు. శనివారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జనవరిలో పాఠశాల భవన నిర్మాణానికి అనుమతి రాగానే పనులు ప్రారంభం చేశానని తెలిపారు. పాఠశాల యాజమాన్యం డబ్బులు సరిగా ఇవ్వకపోవడం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. భవనం పూర్తి చేయకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నిర్మాణ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. డబ్బులు ఇవ్వకుండా తనను పనులు చేయమని అంటున్నారని తెలిపారు. పైగా తనను రాజకీయ పలుకుబడితో బెదిరిస్తున్నారని తెలిపారు. నాకు ప్రాణభయం ఉందన్నారు. తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.


అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం


శివసేనారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ పారిజాతారెడ్డి

శాట్ చైర్మన్‌కు మేయర్ శుభాకాంక్షలు

సరూర్‌నగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ(శాట్) చైర్మన్‌గా నియమితులైన శివసేనారెడ్డిని శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, సీపీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దయారెడ్డి తదితరులతో కలిసి ఆయనకు బొకే అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం పారిజాత మాట్లాడుతూ శివసేనారెడ్డి మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.


వెంకట్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న మిద్దెల జితేందర్

టీపీసీ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వెంకట్‌రెడ్డి

చంపాపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా చంపాపేట డివిజన్‌కు చెందిన మెట్టు వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్జీ దేశాయ్ టీపీసీ సేవాదళ్ జయింట్ సెక్రటరీగా వెంకట్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని సేవాదళ్ కార్యాలయంలో శనివారం టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చేతుల మీదుగా వెంకట్‌రెడ్డి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తనను నియమించినందుకు గాను టీపీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ.గౌడ్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమాజానికి హానిచేసే అంశాలను తొలగించాలి

● కేంద్ర సెన్సార్‌బోర్డ్ సభ్యుడు కృష్ణాదిశేషు

వనస్థలిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): సమాజానికి హానిచేసే అంశాలను తొలగించాలని కేంద్రమంత్రి జీ.కిషన్‌రెడ్డిని కేంద్ర సెన్సార్‌బోర్డ్ సభ్యుడు కృష్ణాదిశేషు కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డిని కృష్ణాదిశేషు మర్యాదపూర్వకంగా శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెన్సార్ బోర్డు ద్వారా సినిమాల్లో సమాజానికి హానిచేసే దృశ్యాలను, డైలాగులను నియంత్రించడానికి కృషి చేయాలని మంత్రిని కోరారు. బీజేపీ యువమోర్చా ప్రధాన కార్యదర్శి నాయకులు జ్యోతి పాల్గొన్నారు.


మహిళా కండక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూయూఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్, నేతలు

మహిళా కండక్టర్లకు సెకండ్‌షిఫ్ట్ డ్యూటీలు వద్దు

● ఎస్‌డబ్ల్యూయూఐఎన్‌టీయూసీ

హైదరాబాద్‌సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు సెకండ్‌షిఫ్ట్ డ్యూటీలు నిలిపివేయాలని ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్ అన్నారు. ఎస్‌డబ్ల్యూ యూఐఎన్‌టీయూసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్టీసీ మహిళా కండక్టర్ల సదస్సు ను శనివారం నిర్వహించారు. సదస్సులో మహిళా కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళా కండక్టర్ల పాత్ర చాలా ప్రధానమైందన్నారు. ప్రధానకార్యదర్శి అబ్రహం మాట్లాడుతూ చిన్నచిన్న కేసుల్లో మహిళా కండక్టర్లను సస్పెండ్ చేయవద్దని సూచించారు. కొంతమంది అధికారులు మహిళా కండక్టర్లకు కష్టమైన డ్యూటీలేవేస్తూ వేధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్ శ్రీజెన్ సుశీల్, జక్కుల మల్లేష్, ఆఫీస్‌ఖాన్, సుధాకర్, ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్ట్

● 12 బైక్‌లు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో రెక్కీ చేసి, ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను పట్టుకున్నారు మీర్‌చౌక్ పోలీసులు. మొత్తం ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహరా శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఉప్పుగూడకు చెందిన గాదె శివరాజ్, బోడుప్పల్‌కు చెందిన మల్లం గణేష్, వలిగొండకు చెందిన పులిపాల్పుల శివ, నకిరేకల్‌కు చెందిన మల్లం నర్సింహ, తిప్పర్తికి చెందిన ఏపూరి విద్యాసాగర్‌లు ఒక ముఠాగా ఏర్పడి నగరంలోని పలు ప్రాంతాల్లో రెక్కీ చేసి, ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్నారు. వాటిని ఇతర జిల్లాలకు తరలించి తక్కువ ధరకు అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో జూన్ 29న మీరాలంమండి వద్ద నరేష్‌కుమార్ అనే వ్యాపారి తన హోండా యాక్టివాను పార్కింగ్ చేయగా. ఎవరో దుండగులు చోరీ చేశారు. దాంతో బాధితుడు మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో రంగంలోకి దిగిన మీర్‌చౌక్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించి దొంగల ముఠాను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12బైక్‌లను రికవరీ చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన తప్పిపోయిన బాలుడు


బాలుడు నహీం

చాదర్‌ఘాట్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట సోహెల్ హోటల్ వద్ద శనివారం ఏడుస్తూ గుర్తించిన బాలుడిని స్థానికులు చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. ఆరేళ్ల బాలుడు తన పేరు నహీం అని మాత్రమే చెబుతున్నాడు. మిగతా వివరాలు చెప్పలేక పోతున్నాడని పోలీసులు తెలిపారు. తప్పిపోయిన బాలుడిని కుటుంబీకులు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.